సాక్షి
అనంతపురం
శనివారం ¦ 4 ¦ అక్టోబర్ ¦ 2025



టమాట కిలో రూ.25

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25, కనిష్టం రూ.14, నరాసరి రూ.20 ప్రకారం పలికింది.



పెట్రోలు బంకుల్లో దోపిడీ

జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో సిబ్బంది తూకాల్లో మోసాలకు పాల్పడటంతో వినియోగదారులు తిరగబడ్డారు. దీంతో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. 10లో

గరిష్టం/కనిష్టం
35.2°/21.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

రెడ్‌బుక్ రాజ్యాంగం...

ఖాకీల ఇష్టారాజ్యం

- శాంతిభద్రతల పేరుతో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తరచూ వేధింపులు
- శుభకార్యాలు, కార్యకర్తల పరామర్శకు సైతం వెళ్లకుండా అడ్డగింత
- ముందస్తు సమాచారమిచ్చినా పెద్దారెడ్డి పర్యటనలకు అనుమతి నిరాకరణ
- 15 నెలలుగా శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లింది టీడీపీ నేతల తీరుతోనే..
- అయినా పోలీసులు నిలువరించేది విపక్ష పార్టీ నేతలనే..



తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షిప్రతినిధి, అనంతపురం: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ఉదయం తాడిపత్రిలో ఓ వివాహానికి బయలుదేరారు. అదే సమయంలో పెద్దారెడ్డి పర్యటించే ప్రాంతానికి దగ్గర్లోనే మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పర్యటిస్తున్నారని, శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం అవుతుందని పోలీసులు పుట్లూరు రోడ్డులోని రైల్వేగేటు వద్ద పెద్దారెడ్డిని అడ్డుకున్నారు. చివరకు బంధువుల పెళ్లి కూడా చూడకుండా పెద్దారెడ్డి వెనుదిరిగారు. పైగా సెప్టెంబర్ 29 నుంచి పెళ్లిళ్లు ఉన్నాయని, తాను తాడిపత్రిలో పర్యటిస్తానని గత నెల 26న జిల్లా ఎస్పీ జగదీశ్‌కు పెద్దారెడ్డి 'మెయిల్' చేశారు. అయినా ఫలితం లేదు. 'లా అండ్ ఆర్డర్' సమస్యే అయితే జేసీకి ఓ టైం, పెద్దారెడ్డికి మరో టైం ఇవ్వొచ్చు. కానీ పోలీసులు పూర్తిగా పెద్దారెడ్డిని అడ్డుకుని వెనక్కు పంపారు. అధికార పార్టీ, విపక్ష పార్టీలపై పోలీసులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారనేందుకు ఇదొక్క ఉదాహరణ చాలు.

జేసీ ప్రణాళిక అమలే పోలీసుల ఉద్దేశమా?!

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతల సమస్య పేరుతో పెద్దారెడ్డిని తిమ్మంపల్లి, అనంతపురానికే పోలీసులు పరిమితం చేశారు. పెద్దారెడ్డిని అడ్డుకోవడం అనేది పోలీసుల ఉద్దేశం కాదు.. జేసీ ప్రభాకర్‌రెడ్డి లక్ష్యం! పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వబోమని జేసీ పలుసార్లు బహిరంగంగానే మాట్లాడారు. పెద్దారెడ్డికి తనకు వ్యక్తిగతంగా కొన్ని ఉన్నాయని, పెద్దారెడ్డి మినహా మిగిలిన వారితో తనకు ఎలాంటి ఇబ్బందీ లేదని కూడా జేసీ చెప్పారు. అంటే పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వకూడదనే జేసీ ప్రణాళికను పోలీసులు పక్కాగా అమలు చేశారనేది స్పష్టమవుతోంది. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లాలని ఈ 15 నెలల్లో కనీసం 10–15సార్లు ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. ప్రతీసారి ఏదో కారణం చెప్పి తాడిపత్రికి పెద్దారెడ్డి వెళ్లకుండా పోలీసులు నిలువరించారు. చివరకు హైకోర్టుకు వెళితే పెద్దారెడ్డిని తగిన భద్రతతో తాడిపత్రికి పంపాలని సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. దీనిపై కూడా పోలీసులు స్టే తీసుకొచ్చారు. చివరకు పెద్దారెడ్డి సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తొలగించుకుని తాడిపత్రికి వచ్చారు. అయితే ఇప్పటికీ పెద్దారెడ్డి పర్యటనలను ఎక్కడో ఒక చోట, ఏదోరకంగా అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రతీ దానికి పోలీసులు చెప్పే కారణం 'శాంతిభద్రతల సమస్య'.

లా అండ్ ఆర్డర్ బాధ్యత ఎవరిది 'బాసూ!'

తాడిపత్రిలో ఈ 15 నెలల్లో శాంతిభద్రతల సమస్య సృష్టించింది అధికార పార్టీ నేతలే! పెద్దారెడ్డి తాడిపత్రికి వచ్చారని తెలిసి ఆయన్ను కలిసి వెళ్లిన కందిగోపుల మురళీధర్‌రెడ్డి ఇంటిపై టీడీపీ నేతలు దాడి చేశారు. ఇంట్లో ఫర్నీచర్, వాహనాలు ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. గత నెల 17న సూర్యప్రకాశ్‌బాబుపై టీడీపీ నేతలు దాడి చేశారు. పెద్దారెడ్డిని ఏ ఫంక్షన్లకూ పిలవకూడదని జేసీ ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గానికి ఓ హెచ్చరిక జారీ చేశారు. పిలిస్తే తాను మీ గురించి ఆలోచించాల్సి ఉంటుందనే రీతిలో పరోక్షంగా హెచ్చరించారు. ఇలా శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా జేసీ ఎన్నోసార్లు మాట్లాడారు. తన మాట చెల్లుబాటు కాకపోతే అధికారులపై, ప్రజాప్రతినిధులపై పరుష పదజాలంతో రెచ్చిపోయారు. కానీ జేసీపై మాత్రం పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితి ఉత్పన్నమైతే రెండు వర్గాల నుంచి సమస్య ఉంటుంది. ఇరువర్గాలను పోలీసులు కట్టడి చేయాలి. కానీ ఎస్పీ జగదీశ్ మాత్రం 15 నెలలుగా పెద్దారెడ్డిని నియంత్రించడం మినహా జేసీని నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఈ నేపథ్యంలో పోలీసుల వైఖరిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాడిపత్రి ఏఎస్పీగా ఐపీఎస్ అధికారి రోహిత్ కుమార్ చౌదరిని నియమించారు. ఏఎస్పీతో పాటు ఎస్పీ జగదీశ్ ఉన్నారు. వీరిద్దరూ తాడిపత్రిలో 15 నెలలుగా శాంతిభద్రతల సమస్యను కొలిక్కి తీసుకురాలేకపోతున్నారా? అదే నిజమైతే వైఫల్యం ఎవరిది? శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎవరిది? పెద్దారెడ్డిని ఇప్పటికైనా తాడిపత్రి నియోజకవర్గంలో పర్యటించేలా చూస్తారా? లేదంటే జేసీ అనుకున్నట్లు ఈ ఐదేళ్లపాటు శాంతిభద్రతల సమస్య పేరుతో ఇబ్బంది పెడుతూనే ఉంటారా? ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాతికేళ్ల కిందట ఫ్యాక్షన్ రాజకీయాలను కూడా ఐపీఎస్‌లు సమర్థంగా కట్టడి చేసి శాంతిభద్రతలు పరిరక్షించారు. అలాంటిది 8 నియోజక వర్గాలు ఉన్న జిల్లాలో అదీ ఓ నియోజకవర్గంలోని చిన్న సమస్యను 'శాంతిభద్రతల' సాకుగా చూపి దాన్ని వారానికో పెద్ద ఘటనగా చూపిస్తూ రాష్ట్రంలో నిత్యం అనంతపురం జిల్లా వార్తలకెక్కుతుంటే ఇక్కడి శాంతిభద్రతలపై జనాలు ఎలాంటి చర్చ చేస్తున్నారనేది పోలీసులే ఆలోచించాలి. ఐపీఎస్‌ల వ్యవహారశైలి ఇలా ఉంటే జిల్లాలోని ఎస్‌ఐ, సీఐలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారనేది ఇట్టే తెలుస్తోంది.

పెద్దారెడ్డిని అడ్డుకున్న ఘటనలు మచ్చుకు కొన్ని...

- టీడీపీ నేతల దాడిలో గాయపడిన మాజీ కౌన్సిలర్ బాబును పరామర్శించేందుకు తాడిపత్రి నుంచి అనంతపురానికి వెళ్లిన పెద్దారెడ్డి తిరిగి తాడిపత్రికి వస్తుంటే పోలీసుల అనుమతి తీసుకోలేదని కొండాపురం వద్ద అడ్డుకున్నారు.
- ఆగస్టు 18న తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి వస్తుంటే పుట్లూరు మండలం నారాయణపురం వద్ద అడ్డుకున్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నా అడ్డుకోవడం గమనార్హం.
- కోర్టు ఉత్తర్వుల తర్వాత జూన్ 29న తిమ్మంపల్లి నుంచి తాడిపత్రిలోని నివాసానికి పెద్దారెడ్డి చేరుకుంటే, బలవంతంగా ఇంట్లో నుంచి లాక్కెళ్లారు. అప్పుడు సీఐ సాయిప్రసాద్ రివాల్వర్ తీసుకుని కాల్చేస్తా అని వైఎస్సార్‌సీపీ శ్రేణులను బెదిరించారు.
- కోర్టు ఉత్తర్వుల తర్వాత జూలై 8, 18న రెండు సార్లు తిమ్మంపల్లిలోనే అడ్డుకున్నారు.

న్యూస్‌రీల్

వామ్మో చిరుత...!



కుక్కపై దాడి చేస్తున్న చిరుత

కళ్యాణదుర్గం: పట్టణంలోని అక్కమాంబ కొండకు ఆనుకుని ఉన్న పార్వతినగర్‌లోని జనావాసాల్లోకి బుధవారం అర్ధరాత్రి చిరుత ప్రవేశించింది. సమీపంలోని ఓ ఇంటి ఆవరణలోని మెట్లపై కుక్క పడుకుంది. ఒక్క ఉదుటున చిరుత దాడి చేసి కుక్కను కిందకు లాక్కొచ్చింది. గట్టిగా అరుస్తూ చిరుత నుంచి తప్పించుకున్న కుక్క మరో వైపున పరుగెత్తింది. అదే సమయంలో అక్కడే ఆరుబయట పడుకున్న ఓ వ్యక్తి లేవడంతో చిరుత అటునుంచి కొండ ప్రాంతంలోకి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయంతో వణికిపోతున్నారు. చిరుత సంచారంపై పలుమార్లు స్థానికులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జనావాసాల్లోకి రాకుండా చిరుతను బంధించి అటవీ ప్రాంతంలోకి వదలేలా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యసాయి జయంతి ఉత్సవాలకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లు నడపనున్నట్లు డివిజన్ అధికారులు తెలిపారు. అందులో భాగంగా యశ్వంతపూర్–హిందూపురం (06518/19) ప్యాసింజరును ఈ నెల 20 నుంచి 26 వరకు గుంతకల్లు జంక్షన్ వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే బెంగళూరు–ధర్మవరం మధ్య మరో ప్యాసింజర్ రైలు (06595/96) ఈ నెల 20 నుంచి 26 వరకు నడపనున్నట్లు వెల్లడించారు.

సీఈసీ, ఎస్ఈసీలో పలువురికి చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ), స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్ఈసీ)ల్లో జిల్లాకు చెందిన కొందరికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఈసీ సభ్యులుగా ఉమామహేశ్వర్ నాయుడు(కళ్యాణదుర్గం), రంగన్న, నదీం అహ్మద్ (అనంతపురం అర్బన్), ఎస్ఈసీ సభ్యులుగా బోగాతి నారాయణరెడ్డి (శింగనమల), గౌని ఉపేంద్రరెడ్డి (రాయదుర్గం), లింగాల శివశంకర్‌రెడ్డి (అనంతపురం అర్బన్), బొంబాయి రమేష్‌నాయుడు (తాడిపత్రి) నియమితులయ్యారు.

మహనీయుల జీవితం ఆదర్శప్రాయం



మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

అనంతపురం అర్బన్: మహనీయుల జీవితాలు ఆదర్శప్రాయమని, వారు చూపిన శాంతి మార్గంలో నడవాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. ఈ నెల 2న కలెక్టరేట్ ప్రాంగణంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా ఈరోజు మనమంతా స్వేచ్ఛాయుత జీవితం గడుపుతున్నామన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ అహింసను ఆయుధంగా చేసుకుని ఉద్యమించారన్నారు. గాంధీ మహాత్ముడు అందించిన స్ఫూర్తితో ప్రతి గ్రామాన్నీ స్వచ్ఛత గ్రామంగా తీర్చిదిద్దేందుకు పౌరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. లాల్‌బహదూర్ శాస్త్రి స్వాతంత్ర్యోద్యమంలో సైనికులు, రైతులు పాత్రను గుర్తు చేస్తూ జై జవాన్– జై కిసాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతుల్ని చేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, పరిపాలనాధికారి అలెగ్జాండర్, తహసీల్దార్లు హరికుమార్, రియాజుద్దీన్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగమేఘాల మీద 'సెక్టోరియల్స్' చేరిక

- ఆసక్తి చూపని ఏఎస్ఓ.. ఆ పోస్టు భర్తీకి మళ్లీ బ్రేక్?

అనంతపురం ఎడ్యుకేషన్: ఏడాదికి పైగా ఖాళీగా ఉన్న సమగ్రశిక్షలోని సెక్టోరియల్ అధికారుల పోస్టులను ఎట్టకేలకు భర్తీ చేశారు. జిల్లా అధికారులు పంపిన జాబితాకు రాష్ట్ర అధికారులు ఆమోదముద్ర వేశారు. అక్కడి నుంచి జాబితా రాగానే ఎంపికైన టీచర్లు స్కూళ్లల్లో రిలీవ్ అయి ఆగమేఘాల మీద సమగ్రశిక్ష కార్యాలయంలో చేరారు. అసిస్టెంట్ సీఎంఓ కె.చంద్రశేఖర్, ఏఎంఓ పి.వేణుగోపాల్, అలెస్కో కె.రామచంద్ర, అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ) బి.నారాయణస్వామి విధుల్లో చేరగా.. ఏఎస్ఓగా ఎంపికైన ఎన్.నరసింహారెడ్డి మాత్రం చేరలేదు. వాస్తవానికి ఈయన అందరి కంటే మెరిట్ ఉన్నట్లు తెలిసింది. ఏఎంఓ పోస్టు పట్ల ఆసక్తి ఉన్నా.. ఆయనను ఏఎస్ఓ పోస్టుకు ఎంపిక చేయడంతో అనారోగ్య సమస్యల కారణంగా ఆసక్తి చూపలేదు. దీంతో ఏఎస్ఓ పోస్టు భర్తీకి మళ్లీ బ్రేక్ పడినట్లేనని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ) పోస్టుపై కోర్టుకు..

అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ) పోస్టుపై తపోవనం జిల్లా పరిషత్ పాఠశాల ఇంగ్లిష్ టీచరు కిష్టప్ప హైకోర్టును ఆశ్రయించారు. ముందు నోటిఫికేషన్‌లో ఆయన దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అధికారులు ఎంపిక చేశారు. ఆమోదం కోసం రాష్ట్ర అధికారులకు నివేదించగా.. ఎలాంటి కారణం లేకుండా ఆయన్ను తప్పించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన తనను నిబంధనలకు విరుద్ధంగా తప్పించారంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా తర్వాత ఇచ్చిన నోటిఫికేషన్‌లో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ కన్నడలో చదివి ఉండాలని పేర్కొన్నారు. తాజాగా తీసుకున్న నారాయణస్వామి ప్రాథమిక స్థాయిలో అది కూడా ఒక తరగతి మాత్రమే కన్నడలో చదివినట్లు తెలిసింది. ఈయనను ఎంపిక చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహాత్ముని కల సాకారం చేసిన జగన్



మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ నాయకులు

- గాంధీ జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శాంతి, అహింస అనే ఆయుధాలతో గాంధీజీ నాయకత్వంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. గాంధీజీ ఆశయ సాధన కోసం అందరూ కలసికట్టుగా ముందుకెళ్దామన్నారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఒకేసారి 1,25,000 మందికిపైగా యువతకు ఉపాధి కల్పించడంతో పాటు సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే సుపరిపాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 వైద్య కళాశాలలను తీసుకువచ్చారన్నారు. మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచి దేశానికి ఎన్నో సేవలందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వత్థ నాయక్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర నాయకులు వెన్నం శివరామిరెడ్డి, మదిరెడ్డి నరేంద్రరెడ్డి, వేమల నదీం, కృష్ణవేణి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, సైపుల్లాబేగ్, నాయకులు మీసాల రంగన్న, అనిల్‌కుమార్‌గౌడ్, రహంతుల్లా, జావేద్, కైలాస్, రాధాకృష్ణ, ఎంఎస్ఎస్ సాదిక్, వెన్నపూస రామచంద్రారెడ్డి, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, పసలూరు ఓబులేసు, ఉష, తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు చీనీ ఎగుమతులపై దృష్టి



మార్కెట్‌యార్డులో చీనీ వ్యాపారులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం మార్కెట్ నుంచి విదేశాలకు చీనీ ఎగుమతులు చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉన్న చీనీ మార్కెట్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ–నామ్ పద్ధతిలో చీనీ క్రయ విక్రయాల గురించి ఆరా తీశారు. అలాగే ఏటా మార్కెట్‌కు వస్తున్న చీనీకాయలు, పలుకుతున్న ధరలు, రైతులకు కల్పిస్తున్న వసతులు తదితర అంశాల గురించి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్, గ్రేడ్–2 సెక్రటరీ రూప్‌కుమార్, అలాగే ట్రేడర్లను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సీజన్ నుంచి కనీసం 200 టన్నులు చీనీకాయలు విదేశాలకు ఎగుమతి అయ్యేలా చర్యలు తీసుకుంటే రైతులకు మరింత గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంటుందన్నారు.

'అమృత్' పనులు పూర్తి చేయాలి

అనంతపురం అర్బన్: 'అమృత్' పథకం కింద నగరపాలక సంస్థతో పాటు పురపాలక సంఘాల్లో చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. అమృత్ పథకం పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణం, తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రజారోగ్య, నగర పాలక, టిడ్కో అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ 1.0 కింద రూ.15.35 కోట్లతో చేపట్టిన అనంతపురం వాటర్ సప్లయ్ ఇంఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ పనులు, ట్రయల్ రన్ చేపట్టాలని ఆదేశించారు. పథకం కింద గుంతకల్లు పట్టణంలో రూ.10.98 కోట్లతో చేపట్టిన పనులు పూర్తిచేసి ఈ నెలాఖరుకు ట్రయల్ రన్ చేపట్టాలన్నారు. తాడిపత్రిలో పనులు వారంలోగా పూర్తి చేయాలన్నారు. అనంతపురం, గుంతకల్లులో సీవేజ్ అండ్ సెప్టేజ్ నిర్వహణ పనులను, ఇతర మునిసిపాలిటీల్లో చేపట్టిన ఇతర ప్రధాన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడంపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఏపీ టిడ్కో కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణం పూర్తయిన వాటికి సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

301 చెరువులను నింపాలి

జిల్లాలో భూగర్భజలాలు పెరగాలంటే 301 చెరువులను నీటితో నింపాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. నీటి వనరులు, భూగర్భజలాల పెంపు, తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్, మైనర్ ఇరిగేషన్ శాఖల అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో సమీక్షించారు.

పండుగ పూట విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకుమారుడు సుంకన్న, సుదర్శన్ (ఫైల్)





రోడ్డుపై పడి ఉన్న తండ్రీకొడుకుల మృతదేహాలు, ప్రమాదంలో గాయపడిన కుమార్తె

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడి దుర్మరణం
- తీవ్రంగా గాయపడిన ఇద్దరు కుమార్తెలు

ఉరవకొండ/ వజ్రకరూరు: ఆ దంపతులు వారసుడి కోసం ఎన్నో నోములు నోచారు. ఎన్నో గుళ్లు తిరిగారు. ముగ్గురు కుమార్తెల తర్వాత కుమారుడు పుట్టడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. అలా సాఫీగా సాగిపోతున్న కుటుంబంలో రోడ్డు ప్రమాదం ఒక కుదుపు కుదిపేసింది. దసరా పండుగకు ఇంటిల్లిపాది కొత్త దుస్తులు ధరించి సంబరంగా ఉన్నారు. తండ్రీ పిల్లలు అమ్మవారి దర్శనం కోసం బయల్దేరారు. 'అమ్మా గుడి నుంచి రాగానే నాకు ఓళిగ చేసి పెట్టాలి' అంటూ కొడుకు చెప్పాడు. అవే కొడుకు చివరి మాటలు అవుతాయని ఆ తల్లి ఊహించలేదు. అరగంటకే రోడ్డు ప్రమాదంలో భర్త, కుమారుడు దుర్మరణం చెందారన్న వార్త ఆమెను కుదిపేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణంలో అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన మీనుగ సుంకన్న (43), నాగలక్ష్మి దంపతులు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు సులోచన, కల్పన, భవానితో పాటు కుమారుడు సుదర్శన్ (10) సంతానం. గురువారం ఉదయం దసరా పండుగను పురస్కరించుకుని అమ్మవారి దర్శనం కోసం వజ్రకరూరు మండలం కడమలకుంటకు ద్విచక్ర వాహనంపై ఉరవకొండ నుంచి తన కుమారుడు సుదర్శన్, కుమార్తెలు కల్పన, భవానితో కలిసి సుంకన్న బయల్దేరాడు. భార్య నాగలక్ష్మి, పెద్ద కుమార్తె సులోచన ఇంటివద్దే ఉన్నారు. పిల్లలతో కలిసి వెళ్తుండగా ద్విచక్రవాహనాన్ని మార్గమధ్యంలో పీసీ ప్యాపిలి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుంకన్న, కుమారుడు సుదర్శన్ అక్కడికక్కడే మరణించారు. ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. అటువైపు వెళుతున్న వాహనదారులు గమనించి వెంటనే వజ్రకరూరు పోలీసులకు సమాచారం అందించారు. విషయం కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. దేవుడా ఎంత పనిచేశావయ్యా అంటూ సుంకన్న భార్య గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కలచివేసింది. గాయపడిన కుమార్తెలను ఉరవకొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్చురీకి తరలించారు. సుంకన్న భార్య ఫిర్యాదు మేరకు వజ్రకరూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమష్టి కృషి ఫలితమే అనంతకు 'స్వచ్ఛ' అవార్డు

అనంతపురం అర్బన్: సమష్టి కృషి ఫలితంగా 'స్వచ్ఛ జిల్లా అవార్డు– 2025'కు అనంతపురం ఎంపికైనట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 6న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి 'స్వచ్ఛాంధ్ర అవార్డులు – 2025' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నుంచి అందిందన్నారు. వివిధ స్వచ్ఛత పరిమితులలో పనితీరు, ఇటీవల స్వచ్ఛతా హీ సేవ ప్రచారం, నెలవారీ స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నందున స్వచ్ఛ జిల్లా అవార్డుకు అనంతపురం ఎంపికయ్యిందన్నారు. ప్రతి ఒక్కరి సమష్టి కృషి ఫలితంగా అవార్డు దక్కిందన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలప్రతినిధులకు ఈ సందర్భంగా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

బెళుగుప్ప ఎంపీపీపై 'అవిశ్వాసం' పెట్టండి

- ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు



అవిశ్వాస తీర్మానపత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు

కళ్యాణదుర్గం: బెళుగుప్ప ఎంపీపీ సి.పెద్దన్నపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు తొమ్మిది మంది పార్టీ నాయకులతో కలిసి కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలిచి ఎంపీపీగా పదవి అలంకరించిన పెద్దన్న అనంతర కాలంలో టీడీపీలోకి చేరిపోవడంతో పాటు అభివృద్ధి పనులకు సహకరించకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులకు కనీస గౌరవ మర్యాదలు ఇవ్వకుండా చులకనగా చూస్తున్నారని వాపోయారు. ఇలా పలు కారణాలతో మెజార్టీ సభ్యులైన తాము ఏపీ పంచాయతీ రాజ్ చట్టం 1991లోని 245 సెక్షన్ 1 మేరకు సి.పెద్దన్నపై అవిశ్వాసం పెట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. తమ విన్నపం మేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, మండల కన్వీనర్ మచ్చన్న, జెడ్పీటీసీ త్రిలోక్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శివలింగప్ప, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, రమణేపల్లి సర్పంచ్ రమేష్, కాలువపల్లి మాజీ సర్పంచ్ తిమ్మన్న, గుండ్లపల్లి వెంకటరెడ్డి, మోహన్, ఎంపీటీసీలు సురేష్‌బాబు, ప్రసాద్, ఈర బొమ్మన్న, పుష్పావతి, వరలక్ష్మి, అంజినమ్మ, నాగరత్నమ్మ, ప్రభావతి, రేఖమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ అక్రమాలకు చెక్!

- కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం
- 15 నుంచి జిల్లాలో అమలు


ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా నూతన మార్గదర్శకాలను ప్రవేశపెడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నూతన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పనుల్లో పాలు పంచుకుంటేనే ఉపాధి వేతనం అందుతుంది. లేకపోతే లేదు.

గతంలో నకిలీ ఫొటోలతో దోపిడీ..

గతంలో ఉపాధి హామీ పథకం నిధులను అడ్డగోలుగా దోచేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శించి జాబ్‌కార్డు ఉంటే చాలు ఉపాధి పనులకు రాకున్న వచ్చినట్లు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేసి వేతనాల రూపంలో రూ.కోట్లు కొల్లగొట్టేశారు. బుక్కరాయసముద్రం మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో 2వేలమంది ఉపాధి కూలీలు ఉంటే రోజు వారీగా 1,900 మందికి పైగా పనులకు హాజరైనట్లు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేశారంటే దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామం మొత్తం ఉపాధి పనులకు హాజరవడంపై జిల్లా అధికార యంత్రాంగమే విస్తుపోయింది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే కేవలం 200మంది మాత్రమే కనిపించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు 20 రోజుల వేతనాలను నిలుపుదల చేశారు. జిల్లాలోని 32 మండలాల్లో ఇదే తంతు కొనసాగినట్లుగా అప్పట్లో అధికారులు గుర్తించారు.

ప్రతి సోమవారం వేతనాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.86 లక్షల జాబ్‌కార్డులు, 11.58 లక్షల మంది శ్రామికులు ఉన్నారు. అనంత జిల్లాలో 3.16లక్షల జాబ్‌కార్డులు, 5.38 లక్షల మంది శ్రామికులు, శ్రీసత్యసాయి జిల్లాలో 3.70 లక్షల జాబ్ కార్డులు, 6.20 మంది శ్రామికులున్నారు. వీరి జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 80 శాతానికి పైగా అనుసంధాన ప్రక్రియను పూర్తయింది. పనులకు హాజరయ్యే శ్రామికులకు ఈ–కేవైసీని తప్పనిసరి చేయడంతో కష్టించిన వారికి మాత్రమే వేతనాలు వారి ఖాతాల్లో జమ కానున్నాయి. వారంలో ఎన్ని రోజులు పని చేసినా.. పని చేసిన రోజులకు సంబంధించి ప్రతి సోమవారం వేతనాలు వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేయనున్నారు. ప్రతి రోజూ రెండు పర్యాయాలు పనులకు హాజరైన ఫొటో, పనులు ముగించిన అనంతరం మరో ఫొటో ఆధారిత హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఈ నెల 15 నుంచి అమలు



ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను మరింతగా అభివృద్ధి చేసి జాబ్‌కార్డులో ఉన్న శ్రామికుల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయనున్నాం. పనులకు హాజరయ్యే శ్రామికులకు ఈ–కేవైసీ తప్పనిసరి చేశాం. ఇప్పటికే జిల్లాలో 80శాతానికి పైగా శ్రామికుల వివరాలను అనుసంధానం చేశాం. మిగిలిన 20 శాతం ప్రక్రియ పూర్తి చేసి 15 నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం. – సలీంబాషా, డ్వామా పీడీ

పెట్రోల్ బంకుల్లో దోపిడీ

జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో దోపిడీ పర్వం కొనసాగుతూనే ఉంది. అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడంతో వినియోగదారుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. తాజాగా అనంతపురంతో పాటు గుంతకల్లులో పెట్రోల్ బంకుల్లో మోసాలపై స్థానికులు తిరగబడ్డారు.

- కొలతల్లో భారీ వ్యత్యాసాలు
- నిలదీసిన వినియోగదారులపై దౌర్జన్యం
- వాహనదారుల్లో పెల్లుబికిన ఆగ్రహం


గుంతకల్లులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఆందోళనకు దిగిన ప్రజలు

అనంతపురం: నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంకులో తక్కువ పెట్రోల్ పోస్తూ మోసం చేస్తున్నారంటూ యువకులు ధ్వజమెత్తారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో కాశీవిశ్వనాథ్ అనే యువకుడు రూ.100 ఇచ్చి పెట్రోల్ పట్టాలని కోరాడు. అందులో కేవలం 50 రూపాయల విలువ గల పెట్రోల్ మాత్రమే పట్టారు. బైక్ నుంచి పెట్రోల్‌ను బాటిల్‌కు తీసుకుని పరిశీలిస్తే కొలతల్లో తేడా రావడంతో పెట్రోల్ బంకు పంప్ ఆపరేటర్‌ను నిలదీశాడు. మీరు ఇచ్చింది రూ.50. పెట్రోల్ కూడా అంతే వేశానంటూ బుకాయించాడు. దీంతో వినియోగదారుడిలో అసహనం రేకెత్తింది. ఈ పెట్రోల్ బంకులో ఏళ్ల తరబడి మోసం జరుగుతోందని, ఈ రోజు పరిశీలిస్తే గుట్టు రట్టయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో పోగయ్యారు. బాధిత వినియోగదారుడికి మద్దతుగా పెట్రోల్ బంకు వద్ద నిరసన తెలిపారు. ప్రజల్ని మోసగిస్తూ.. తక్కువ పెట్రోల్‌ను పడుతున్నారంటూ ధ్వజమెత్తారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మూడు చెట్ల కుండీలను పగులగొట్టారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వన్‌టౌన్ సీఐ జి.వెంకటేశ్వర్లు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. శనివారం వరకూ పెట్రోల్ బంకు తెరవకూడదని, తూనికలు కొలతల శాఖ అధికారులతో తనిఖీ చేయించిన అనంతరం వారు ఆమోదిస్తేనే పెట్రోల్ బంకు తెరవాలని సీఐ ఆదేశించారు.

పెట్రోల్ కొలతల్లో తేడాపై ధ్వజం..

గుంతకల్లు టౌన్: స్థానిక హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొలతల్లో తేడాను గమనించిన వినియోగదారులు ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. తిలక్‌నగర్‌కు చెందిన త్రిలోక్ అనే యువకుడు తన స్నేహితుడు దేగులపాడు నగేష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై పెట్రోల్ వేయించుకునేందుకు బంక్‌కు వెళ్లాడు. అక్కడ మామూలు పెట్రోల్ అయిపోయిందని చెప్పి పవర్ పెట్రోల్ వేశారు. అయితే అనుమానం కలిగిన వారిద్దరూ పెట్రోల్ ట్యాంక్‌లో వేసిన పెట్రోల్‌ను బయటికి తీసి లీటర్ బాటిల్‌లోకి పట్టి చూడగా అరలీటర్ తక్కువగా ఉండడంతో బంక్ సిబ్బందిని నిలదీశారు. పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో విషయాన్ని వెంటనే సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజుకు వినియోగదారులు తెలియజేయడంతో ఆయన అక్కడకు చేరుకుని చేసిన మోసంపై బంక్ సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో తీవ్ర వాగ్వాదం చెలరేగింది. మోసాన్ని వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి సీఐటీయూ నాయకులు తీసుకెళ్లారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పండుగ రోజున గొడవ వద్దని, ఏదైనా ఉంటే రాతపూర్వకంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. పెట్రోల్ కొలతల్లో మోసంపై ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు సీఐటీయూ నాగరాజు, బాధితులు తెలిపారు.

గొంతు కోసుకుని.. ఆస్పత్రి నుంచి పరుగు తీసి!

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- జీజీహెచ్‌లో సర్జరీ తర్వాత సెక్యూరిటీ, తదితరులపై దాడి


ఉరవకొండ ఆస్పత్రి నుంచి పారిపోతున్న శేఖర్‌ను పట్టుకెళుతున్న పోలీసులు

ఉరవకొండ/అనంతపురం కార్పొరేషన్: క్షణికావేశంలో పొలాల్లో గొంతు కోసుకున్న ఓ యువకుడిని ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తుండగా తప్పించుకుని పారిపోయాడు. అతికష్టంపై పోలీసులు వెంటాడి పట్టుకుని మళ్లీ ఆస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం జీజీహెచ్‌లో చేర్పిస్తే అక్కడా తనదైన శైలిలో రెచ్చిపోయి సిబ్బందిపై దాడికి తెగబడ్డాడు. వివరాల్లోకి వెళితే... ఉరవకొండలోని హమాలీ కాలనీకి చెందిన శేఖర్‌కు వివాహమైంది. పిల్లలు లేరు. కుటుంబ కలహాలతో విసుగు చెందిన శేఖర్ క్షణికావేశానికి లోనై గురువారం బూదగవి గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి కత్తితో గొంతు కోసుకున్నాడు. అటుగా వెళుతున్న రైతుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా ఒక్కసారిగా అందరినీ తోసేసి రోడ్డుపైకి పరుగు తీశాడు. సీఐ మహనందితో పాటు సిబ్బంది వెంటపడి పరుగు తీసినా చేతికి చిక్కకుండా తప్పించుకొని పారిపోతుండగా స్థానికులు అతి కష్టంపై అడ్డుకుని నిలువరించారు. వెంటనే శేఖర్‌ను పట్టుకుని పోలీసులు ఆస్పత్రికి చేర్చి, దగ్గరుండి చికిత్స చేయించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని జీజీహెచ్‌కి తరలించారు.

జీజీహెచ్‌లో హల్‌చల్..

గురువారం రాత్రి 8 గంటల సమయంలో శేఖర్‌ను జీజీహెచ్‌కు పోలీసులు, కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. అయితే చికిత్స చేయించుకునేందుకు నిరాకరిస్తూ క్యాజువాలిటీలోని టేబుళ్లపైకి ఎక్కి కేకలు వేస్తూ హల్‌చల్ చేశాడు. చివరకు ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ మధులిక, తదితరులు శేఖర్‌కు మత్తు ఇంజక్షన్ ఇచ్చి, మెయిన్ ఆపరేషన్ థియేటర్‌కు తరలించి శస్త్రచికిత్స చేసి, ఈఎన్‌టీ వార్డుకు తరలించారు. కాసేపటికి తేరుకున్న శేఖర్ అక్కడున్న సెక్యూరిటీ, అటెండర్‌పై కర్రతో దాడి చేశాడు. శుక్రవారం ఉదయం శేఖర్‌ను మెరుగైన వైద్యం కోసం కడప ఆస్పత్రికి తరలించారు.

సజ్జలకాలువలో తెలుగు తమ్ముళ్ల దాడి

రాప్తాడురూరల్: భూ సమస్యపై అనంతపురం రూరల్ మండలం సజ్జలకాలువ గ్రామంలో దసరా పండుగ రోజు ఇద్దరిపై తెలుగు తమ్ముళ్లు దాడికి తెగబడ్డారు. గ్రామస్తులు తెలిపిన మేరకు... మాలపాటి గోపాల్‌కు 13 ఎకరాల పూర్వ పట్టా భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన గంగంపల్లి గంగన్న ఐదేళ్ల క్రితం గోపాల్ భూమి పక్కన ఉన్న 4.08 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఇటీవల గోపాల్ భూమికి హద్దులు వేసుకుంటున్న క్రమంలో ఆ భూమిలో తనకూ ఇంకా కొంత భూమి వస్తుందని గంగన్న గొడవకు దిగాడు. రికార్డుల మేరకే హద్దులు వేస్తున్నానని గోపాల్ చెబుతున్నా పట్టించుకోలేదు. ఇదే విషయమై గ్రామంలో గురువారం సాయంత్రం మరోమారు రెండు కుటుంబాలు వాదించుకున్నాయి. ఈ క్రమంలో గంగన్న, ఆయన కుమారుడు మణికంఠ కలిసి గోపాల్, ఆయన కుమారుడు హేమంత్‌పై గడారులతో దాడి చేశారు. దీంతో హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను హుటాహుటిన అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కాగా బాధిత కుటుంబం టీడీపీ మద్దతుదారు కావడం విశేషం. ఈ సమస్య నాలుగేళ్లుగా జరుగుతున్నా పోలీసులు గట్టి చర్యలు తీసుకోకపోవడంతోనే దాడుల వరకు వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

కంటి తుడుపు ప్రదర్శన.. కనిపించని రైతులు


పరికరాల ప్రదర్శనలో పాల్గొన్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ, శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు స్థానిక ఆగ్రోస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాల ప్రదర్శనకు రైతులు కరువయ్యారు. ఏదో చేయాలంటే చేయాలన్నట్లుగా కార్యక్రమాన్ని నిర్వహించడంతో పట్టుమని 20 మంది కూడా రైతుల హాజరు కాలేదు. వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఆగ్రోస్ మేనేజర్ ఓబుళపతి, డ్వామా పీడీ సలీంబాషా, జెడీబీఎన్‌ఎఫ్ డీపీఎం లక్ష్మానాయక్, ఏఆర్‌ఎస్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.విజయశంకరబాబు, డాక్టర్ ఎస్.మల్లీశ్వరి, ఏడీఏ అల్తాఫ్‌తో పాటు ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ అధికారులు, ఆయా శాఖల సిబ్బంది, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, ఓ ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. డ్రోన్లు, రోటోవేటర్లు, టిల్లర్లు, ఇతర కొన్ని పరికరాలు ప్రదర్శించారు. ట్రాక్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ పరికరాలపై 12 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించినట్లు జేడీఏ తెలిపారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న న్యాయవాదులు

అనంతపురం: జూనియర్ న్యాయవాదులకు తక్షణమే స్టైఫండ్ చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవరావు డిమాండ్ చేశారు. అనంతపురం బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమిత్ర పథకం కింద ప్రతి నెలా జూనియర్ న్యాయవాదులకు ఇచ్చే శిక్షణ భృతిని పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. న్యాయవాదుల కోసం ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామన్న హామీని విస్మరించారని విమర్శించారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కరించకపోతే అఖిల భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐలు అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు ఈ.ప్రసాద్, నాగరాజు, కమిటీ సభ్యులు నాగభూషణ్, శ్రీనివాస్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కల్లూరులో నివాసముంటున్న రాము (37)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిస కావడంతో రెండేళ్ల క్రితం పిల్లలను పిలుచుకుని భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లి ఓబుళమ్మతో కలసి ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం రాము ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన తల్లి వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కాపాడి పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని జీజీహెచ్‌కు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి రాము మృతి చెందాడు. కాగా, రాము మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ‘ఆటో డ్రైవర్ సేవలో’ ప్రారంభం : డీటీసీ

అనంతపురం సెంట్రల్: ఆటో, మ్యాక్సీ క్యాబ్ వాహన డ్రైవర్లకు రూ.15వేల ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించనున్నట్లు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతపురం అర్బన్ పరిధిలో 1,137 మంది, గుంతకల్లులో 1,655 మంది, కళ్యాణదుర్గం 323 మంది, రాప్తాడు 1,752 మంది, రాయదుర్గం 343 మంది, శింగనమల 1,643 మంది, తాడిపత్రి 1,614 మంది, ఉరవకొండ 808 మంది ఈ పథకానికి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

కసాపురంలో వైభవంగా గ్రామోత్సవం


గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేష వాహనంపై కొలువుదీర్చి ఆలయ ఈఓ ఎం.విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ ఆధ్వర్యంలో పురవీధుల గుండా ఊరేగించారు. ఉత్సవంలో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక డంప్ సీజ్


ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మునివేలు, ఎస్‌ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: అక్రమంగా డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు, పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. వివరాలు... బొమ్మనహాళ్ మండలంలోని కురువల్లి, బొల్లనగుడ్డం గ్రామాలకు చెందిన కొందరు అధికార పార్టీ అండతో ఇసుక దందా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 25 ట్రాక్టర్ల ఇసుకను కురువల్లి గ్రామ శివారులో డంప్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నబీరసూల్, తహసీల్దార్ మునివేలు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా నిల్వలు చేసిన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మునివేలు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

గుత్తి: స్థానిక చెంబుల బావి వీధిలో రెండు రోజుల క్రితం రూ.300 కోసం గొడవపడి వెంకట్రామిరెడ్డిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడి దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయన్నారు. వాటి ఆధారంగా, బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన అఫ్జల్, ఆదిల్, ఆరీఫ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రామారావు వెల్లడించారు.

గాంధీ జయంతి రోజున యథేచ్ఛగా మద్యం అమ్మకాలు


బ్రహ్మసముద్రంలో గాంధీ జయంతి రోజున మద్యం విక్రయిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మహాత్మా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం అమ్మకాలు నిషేధం. అయితే ఇందుకు బ్రహ్మసముద్రం గ్రామానికి అధికారులు మినహాయింపునిచ్చినట్లుగా ఉంది. గాంధీ జయంతి, దసరా రెండూ ఒకే రోజు రావడంతో బ్రహసముద్రంలో బెల్ట్ షాపు నిర్వాహకులు హంగామా చేశారు. ఎలాంటి అనుమతులు లేకున్నా.. బెల్ట్ షాప్‌ను పూలతో ముస్తాబు చేసి, 2వ తేదీ ఉదయం 6 గంటలకే మద్యం అమ్మకాలు మొదలు పెట్టారు. విషయం తెలిసినా అటుగా రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. స్థానికులు కొందరు కళ్యాణదుర్గం ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన మరుక్షణమే బెల్ట్‌షాపు నిర్వాహకుడికి ఫోన్ చేసిన వారి సమాచారం అందించి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా సాగుతోందంటూ స్థానికులు మండిపడ్డారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న చింతలరాయుడు

తాడిపత్రి రూరల్: స్థానిక చింతల వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూర్యప్రభ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవలను నేత్రపర్వంగా నిర్వహించారు.

కేశేపల్లి టీచర్‌కు అంతర్జాతీయ కార్టూనిస్ట్ అవార్డు


చిన్న కుళ్లాయప్ప

శింగనమల(నార్పల): అబ్లా ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కార్టున్ – ఎల్‌నాస్‌ఎల్ హల్వా 2025 పోటీల్లో నార్పల మండలంలోని కేశేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఆర్ట్ టీచర్ చిన్న కుళ్లాయప్పకు అవార్డు దక్కింది. క్యారికేచర్ విభాగంలో వివిధ దేశాలకు చెందిన పలువురు కార్టూనిస్టులు పోటీ పడగా, భారత దేశం నుంచి తలపడిన చిన్న కుళ్లాయప్ప ద్వితీయ స్థానంలో నిలిచారు. దీంతో ఆయనను నార్పల మండల వాసులు, తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ డిమాండ్

అనంతపురం మెడికల్: పీహెచ్‌సీ వైద్యుల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలని కూటమి సర్కార్‌కు ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులు హితవు పలికారు. సమ్మెలో భాగంగా శుక్రవారం అనంతపురంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీ వైద్యులుగా మూడేళ్ల పాటు విధులు కొనసాగించిన తర్వాత పీజీ వైద్య విద్యను అభ్యసించడానికి గతంలో ఉన్న 30 శాతాన్ని 15 శాతానికి కుదించడం సబబు కాదన్నారు. టైం బౌండ్ పదోన్నతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. గత నెలలో సెకండరీ హెల్త్ సర్వీసులో కేవలం రెండు సంవత్సరాలు పూర్తయిన సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా హోదా ఇచ్చి ఇంత వరకూ ప్రొబేషనరీ పీరియడ్ డిక్లరేషన్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ నాయకులు డాక్టర్ లోకేష్, డాక్టర్ శివసాయి, డాక్టర్ మనోజ్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ శివశంకర్ నాయక్, డాక్టర్ జయకుమార్ నాయక్, డాక్టర్ స్వాతి, డాక్టర్ సుష్మిత డాక్టర్ చందన, డాక్టర్ హనీషా తదితరులు పాల్గొన్నారు.

‘దుర్గం’లో పట్టపగలే భారీ చోరీ

- రూ.10 లక్షల నగదు, 20 తులాల బంగారం అపహరణ


బీరువాలోని వస్తువులు చెల్లాచెదురు చేసిన దృశ్యం

కళ్యాణదుర్గం: స్థానిక పార్వతీ నగర్‌లో పట్టపగటే భారీ చోరీ జరిగింది. దసరా పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు ఉదయం బంధువుల ఇంటికెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేలోపు చోరీ జరగడం గమనార్హం. పోలీసులు తెలిపిన మేరకు... పార్వతీనగర్‌లో నివాసముంటున్న మహేంద్ర నాయుడు.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఆటోమొబైల్స్ దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దసరా పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి శుక్రవారం ఉదయం బంధువుల ఆహ్వానం మేరకు బెళుగుప్ప మండలం విరుపాపల్లిలో జరిగే ఓ విందు కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చిలోపు తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి గమనించారు. రూ.10 లక్షల నగదు, 20 తులాల బంగారు నగలు అపహరణకు గురైనట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పట్టణ సీఐ హరినాథ్, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, స్వాధీనం చేసుకున్న సీసీ ఫుటేజీల్లో ఓ దొంగ కదలికలను పోలీసులు స్పష్టంగా గుర్తించారు.

బదిలీపై 22 మంది టీచర్ల రాక

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా జిల్లాకు 22 మంది వచ్చారు. శుక్రవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి స్కూళ్లు కేటాయించారు. బదిలీల్లో జిల్లాకు వచ్చిన వారిలో హెచ్‌ఎంలు ఇద్దరు, పీఎస్‌హెచ్‌ఎంలు ఇద్దరు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఒకరు, స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఒకరు, గణితం ముగ్గురు, పీఎస్ ముగ్గురు, బీఎస్ ఒకరు, ఇంగ్లీష్ ఒకరు, పీఈటీ ఒకరు, ఎస్జీటీలు ఏడుగురు ఉన్నారు. కాగా 3, 4 కేటగిరీలకు సంబంధించి కొన్ని స్కూళ్లు మాత్రమే ఖాళీలు చూపడంపై యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఆయా కేటగిరీల్లో అన్ని ఖాళీలను చూపించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న ఏపీసీ శైలజా

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) శైలజ సూచించారు. బీకేఎస్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న విజయ భారతి డీఈడీ కళాశాలలో జిల్లాలో ఎంపికైన ఎస్జీటీలకు ఇండక్షన్ ట్రెనింగ్‌ను ఆమె తోపాటు డీవైఈఓ శ్రీనివాసులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ట్రెనింగ్ ఇస్తున్నామన్నారు.ఈ శిక్షణా కార్యక్రమానికి 148 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో గోవర్ధన్, ఎంఈఓలు లింగా నాయక్, విజయాకుమారి, ఏఎంఓ వేణు గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరం స్వర్ణలతకు పరామర్శ



పేరం స్వర్ణలతతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బ్రెయిన్ సంబంధిత సర్జరీ అనంతరం తాడిపత్రిలోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట రాష్ట్ర పార్లమెంటరీ కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, ఓబులరెడ్డి తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్ పనులు పూర్తి



రాచానపల్లి వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులు

అనంతపురం కార్పొరేషన్: రాచానపల్లి వద్ద డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ పనులకు రంధ్రంతో పాటు జాయింట్ కనెక్షన్‌కు ఏర్పడ్డ సమస్యలను నివృత్తి చేసేలా నగరపాలక సంస్థ ఇంజినీర్లు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం నుంచి అన్ని ప్రాంతాలకూ యథావిధిగా నీటి సరఫరా కొనసాగిస్తామని తెలిపారు.

డెమోగా నాగరాజు

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ డెమోగా ఈడిగ నాగరాజు నియమితులయ్యారు. నాగరాజు ఇదే కార్యాలయంలో పీఓడీటీ విభాగంలో హెచ్ఈఈఓగా పని చేసేవారు. జిల్లా మాస్ మీడియా అధికారిగా ఆయనకు పదోన్నతి లభించింది. శుక్రవారం ఆయన డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి వద్ద రిపోర్టు చేసుకున్నారు.

'నిజాంను రప్పించాలి'

అనంతపురం కార్పొరేషన్: సౌదీలో చిక్కుకున్న నగరానికి చెందిన నిజాంను రప్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం కోరారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏజెంట్ల మాటలు విని అమాయక ప్రజలు నష్టపోతున్నారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం వేడుకలు

ఆత్మకూరు: మండలంలోని వై.కొత్తపల్లి సమీపంలోని గుట్టపై ఉన్న హజరత్ రోషన్ ఖాద్రీ గంధం వేడుకలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గుట్టపై ఉన్న దర్గాలో గంధం చదివించి ప్రార్థనలు చేశారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

అంబరం.. దసరా సంబరం



కొత్తూరు అమ్మవారి శాలలో మహా వారాహిదేవి విశ్వరూప అలంకరణలో దర్శనమిస్తున్న దృశ్యం



కొత్తూరు అమ్మవారిశాలలో బారులుదీరిన భక్తులు



శివబాలయోగి ఆశ్రమంలో అమ్మవారు



పాతవూరు అమ్మవారిశాలలో...

అనంతపురం కల్చరల్: దసరా పండుగ సంబరం అంబరమంటింది. విజయదశమి పర్వదినాన్ని జిల్లా వాసులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ఆలయాల్లో నవవిధ రూపాలలో దర్శనమిచ్చిన అమ్మవారు విజయకనకదుర్గగా, అన్నపూర్ణేశ్వరిగా సర్వాలంకారంలో భక్తులకు నేత్రపర్వం చేసింది. మొదటిరోడ్డులోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ఈవో నాగేంద్రుడు, ఆలయ చైర్మన్ నరేంద్రచౌదరి ఆధ్వర్యంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి పూజలు చేశారు. పదిరోజుల పాటూ హోమాలతో సాగిన రెండోరోడ్డు శ్రీజ్ఞానపీఠంలో మధుసూదనరావు నేతృత్వంలో మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగించారు. కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విద్యుద్దీప కాంతుల నడుమ సర్వాంగ సుందరంగా వారాహి మాతగా అలంకరించిన అమ్మవారి ప్రతిరూపాలను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హెచ్చెల్సీ కాలనీ కొల్హాపూర్ మహాలక్ష్మి మందిరం, ముత్యాలమ్మ, రెండవరోడ్డు శ్రీజ్ఞానం పీఠం, శ్రీశివబాలయోగి ఆశ్రమం అనంతేశ్వరి, శివకోటి, శారదా శంకరమఠం, ఉమానగర్ రేణుకా యల్లమ్మ, తపోవనం శ్రీవేదమాత గాయత్రిదేవి, ఐదో రోడ్డు సుంకలమ్మ, పెద్దమ్మ ఆలయాలు కిటకిటలాడాయి.

షిర్డీసాయి మహాసమాధి వేడుకలు



విశేష పుష్పాలంకరణలో షిర్డీ సాయినాథుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని బాబా మందిరాల్లో షిర్డీసాయి మహాసమాధి వేడుకలు వైభవంగా జరిగాయి. మహాసమాధి పొంది 107 ఏళ్లయిన సందర్భంగా మధ్యాహ్నం 107 దీపాలు వెలిగించి ప్రత్యేక అలంకార సేవలు, హారతులతో వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. సాయినాథుడికి ప్రీతికరమైన గురువారం పుణ్యతిథి వేడుకలు రావడంతో సద్గురు బాబా భక్తిగీతాలతో, నామస్మరణతో మందిరాలు మార్మోగాయి. ఆలయాలను దీపాలతో శోభాయమానంగా అలంకరించి కాగడా హారతులు నిర్వహించారు. వేమనా టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో షిర్డీ సాయి మందిరాల రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రచౌదరి నేతృత్వంలో విశేష అలంకార సేవలు, ప్రసాద వితరణ జరిగింది. భక్తులు స్వయంగా బాబా స్పర్శ దర్శనంతో పులకించిపోయారు. మూడవరోడ్డు, పాతూరు చెరువుకట్ట, రామచంద్రానగర్, వేణుగోపాలనగర్, తపోవనం శ్రీశివశక్తిబాబా మందిరం తదితర చోట్ల మహాసమాధి వేడుకలకు భక్తులు పోటెత్తారు.

ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తా

- అక్రమ కేసులకు ఎవ్వరూ భయపడకండి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఎంపీటీసీలు, మండల నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ''రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారు. అయినా ఎవరూ భయపడకండి. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తకు తోడుంటా. కష్టంలో అండగా నిలుస్తా'' అనిమాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం అనంతపురంలోని తన నివాసంలో ఆత్మకూరు మండల ఎంపీటీసీలు, మండల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వై సీపీ అధికారంలో ఉన్నప్పుడు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. కానీ నేడు టీడీపీ నాయకులు పథకాల గురించి పక్కన పెడితే..అన్యాయంగా వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులను సమష్టిగా ఎదుర్కొందామన్నారు. ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందన్నారు. త్వరలోనే తాను ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తానని తెలిపారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మదిగుబ్బ ఎంపీటీసీ లక్ష్మీదేవి భర్త పెద్దన్న పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్, ముఖ్య నాయకులు మదిగుబ్బ వీరాంజనేయులు, కన్వీనర్ బాలపోతన్న, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, ఎంపీటీసీలు ఓబులేసు, లక్ష్మీదేవి, నాయకులు అంజినప్ప, భాస్కర్, అతిక్‌రెడ్డి, జగదీష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం కార్పొరేషన్: జాతిపిత మహాత్మా గాంధీకి మేయర్ వసీం ఘనంగా నివాళులర్పించారు. గురువారం నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, ఈఈలు షాకీర్, చంద్రశేఖర్, డీఈ నరసింహ, కార్పొరేటర్లు లాలూ, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

'ఆదిశంకరుల పుస్తకం' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనంత

అనంతపురం కార్పొరేషన్: విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ పి.రమేష్ నారాయణ రాసిన 'శ్రీ ఆదిశంకరులు' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. మహనీయుల చరిత్రను తన రచనల ద్వారా ఆధునిక సమాజానికి పరిచయం చేసేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

అనంత ఆర్టీసీ బస్టాండ్‌కు 'స్వచ్ఛ' అవార్డు

అనంతపురం క్రైం: జిల్లాస్థాయిలో అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రతిష్టాత్మక 'స్వచ్ఛ బస్టాండ్' అవార్డు దక్కించుకుంది. పరిశుభ్రత, నిర్వహణ, ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలు వంటి అనేక అంశాల్లో విశ్లేషణ జరిపిన అనంతరం ఈ ఎంపిక జరిగినట్లు ఆర్టీసీ డీఎం నాగభూపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విజయానికి ప్రతి కార్మికుడి శ్రమ, ఉద్యోగుల సహకారం ఉందన్నారు. తమకున్న పరిధిలో సౌకర్యాలను సమకూర్చుకుంటూ బస్టాండులో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, శుభ్రత నిర్వహణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ప్రధానంగా ఉన్నతస్థాయి అధికారుల నుంచి కింది స్థాయిలోని కార్మికుడి దాకా ఆర్టీసీ బస్టాండు అభివృద్ధికి పాటుపడటంతో ఈ గౌరవం దక్కిందన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దండి

- డీఎస్సీ-25 కొత్త టీచర్లకు శిక్షణ ప్రారంభంలో విద్యాశాఖ జేడీ సుబ్బారావు



మాట్లాడుతున్న సుబ్బారావు

అనంతపురం ఎడ్యుకేషన్: 'చాలా కష్టపడ్డారు. వేలాది మంది పోటీ పడ్డ పరీక్షల్లో ప్రతిభ చాటి పోస్టులు దక్కించుకున్నారు. అంతే కష్టపడి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి' అని కొత్త టీచర్లకు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు సుబ్బారావు సూచించారు. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ-25కు ఎంపికైన టీచర్లకు శుక్రవారం మూడు కేంద్రాల్లో శిక్షణ ప్రారంభమైంది. అనంతపురం రూరల్ ఆకుతోటపల్లి సమీపంలోని వివేకానంద జూనియర్ కళాశాల, బుక్కరాయసముద్రం సమీపంలోని విజయభారతి డీఎడ్ కళాశాల, కొర్రపాడు సమీపంలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో రెసిడెన్షియల్ విధానంలో ఈ నెల 10వ తేదీ వరకూ శిక్షణ కొనసాగనుంది. ఉమ్మడి జిల్లా నుంచి 755 మందికిగాను 747 మంది, కర్నూలు జిల్లా నుంచి 723 మందికి గాను 710మంది టీచర్లు హాజరయ్యారు. వివేకానంద జూనియర్ కళాశాలలో శిక్షణను జేడీ సుబ్బారావు ప్రారంభించి, మాట్లాడారు. పాఠశాలలకు వేళలకు అటెండ్‌కావాలన్నారు. సాధారణంగా డీఎస్సీ భర్తీలో దూరప్రాంతాల బడులే ఎక్కువగా ఉంటాయన్నారు. ఎవరూ నిరాశ చెందకుండా బడులకు వెళ్లాలన్నారు. విధుల్లో తక్కిన వారికి రోల్‌మోడల్‌గా నిలవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీవైఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హులైన పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు గురువారం రాత్రి డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతుల ఉత్తర్వులు అందజేశారు. విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సూపరింటెండెంట్ జగదీష్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 114 మంది పండిట్లకు పదోన్నతులు దక్కాయి. వీరిలో తెలుగు 90 మంది, కన్నడ ఒకరు, హిందీ 14 మంది, ఉర్దూ 9 మంది పండిట్లు ఉన్నారు.

పోరాటం ఫలించింది : ఎస్టీయూ

పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని సుదీర్ఘకాలంగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించిందని ఎస్టీయూ)జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు అన్నారు. పండిట్లకు పదోన్నతుల కోసం ఎస్టీయూ సాగించిన పోరాటాలను గుర్తు చేశారు. పదోన్నతులు పొందిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



పురుషులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అనంతపురం రూరల్: పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటేనే తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ -5 సెక్టార్ పరిధిలోని ముత్యాలమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ మహా' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి సీడీపీఓ ఉమాశంకరమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. చిరుధాన్యాలు, కూరగాయలు, పాలు, పండ్లు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్లలో పురుషుల భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఆశాబీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, షాను, గంగాదేవి, ఎంఎస్‌కే లిఖిత, పాఠశాల హెచ్‌ఎం డి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోములదొడ్డిలో పోషణ్ మాసోత్సవాలు

రాప్తాడురూరల్: సోములదొడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 'పోషణ్ మాసోత్సవాలు' నిర్వహించారు. ఇందులో భాగంగా 'పురుషుల భాగస్వామ్యం పోషణ చాంపియన్లుగా' పలువురిని సత్కరించారు. కుటుంబానికి పోషణ, తల్లి – శిశు సంరక్షణలో పురుషులు కూడా భాగస్వామ్యం కావాలని, పోషకాహారంపై చైతన్యం కలిగించిన పురుషులను సత్కరించారు. ప్రతి నెలా నిర్వహించే పోషణ వేడుకల్లో పురుషులు కూడా పాల్గొనేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పౌష్టికాహారంతోనే మాతా శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పంపనూరు తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ మహ' కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు

అనంతపురం రూరల్: శిల్పారామంలో మూడు రోజులుగా నిర్వహించిన దసరా వేడుకలు ముగిశాయి. గురువారం నృత్యకళా నిలయం ఆధ్వర్యంలో క్లాసిక్, జానపద నృత్య ప్రదర్శన అలరించింది. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దసరా పండగ సందర్భంగా ప్రజలకు వినోదాన్ని అందించాలన్న ఉద్దేశంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. ఇందులో భాగంగా ఈనెల 7న తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఫ్యాప్టో నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, ఫణి భూషణ్, ఓబులేసు, నారాయణ నాయక్, తులసిరెడ్డి, ఈ.రామాంజనేయులు, నాగభూషణనాయుడు, జనార్దన్, ఆదిశేషు, హుస్సేన్ ఖాన్, భాగ్యరాజు, ఆదినారాయణ మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో 72, 73, 74 జీఓలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలన్నారు.

మహిమాన్వితుడు మాబుసుబాని



నగర వీధుల్లో గంధం ఉత్సవం

అనంతపురం కల్చరల్: మహిమాన్వితుడిగా పేరొందిన మాబుసుబాని (దస్తగిరి స్వామి) జీవితం ఆదర్శప్రాయమని మతపెద్ద మహమ్మద్ కుషాల్ అన్నారు. నగరంలోని శ్రీనివాసనగర్‌లో షాహేగౌసే ఆజం ఆషార్ దర్గాలో ఎనిమిదిరోజులుగా సాగుతున్న మాబుసుబాని ఉరుసు ఉత్సవాల్లో శుక్రవారం గంధం ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన మతపెద్ద మహమ్మద్ కుషాల్ దస్తగిరి స్వామి జీవిత విశేషాలు, మహిమలను వివరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ శనివారం జరిగే ఉరుసు ఉత్సవానికి సర్వం సిద్ధం చేశామన్నారు. సాయంత్రం దస్తగిరిస్వామి పవిత్ర కేశాన్ని ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేస్తామన్నారు. దస్తగిరి స్వామి ఉరుసు ప్రత్యేకతను వివరించడానికి తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారుక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా, ముఖ్య అతిథులుగా కర్నూలు హజరత్ సయ్యద్ షా వజ్యుద్దీన్ ఖాదిరి విచ్చేసి గుసుల్, దువా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. భక్తులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు.

వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ఉదయం ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకేశ్వరస్వామి ఆలయంలో చక్రస్నానం, వసంతోత్సవం, శయనోత్సవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా గురువారం నిర్వహించిన శ్రీవారి బ్రహ్మరథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగిసినట్లు వెల్లడించారు. అదేవిధంగా హౌసింగ్ బోర్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన హోమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రామనగర్, శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో బ్రహ్మత్సవ ముగింపు వేడుకలు కమనీయంగా సాగాయి.

8న పాత వాహనాల వేలం

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ ఆవరణలో మూలన పడిన పాత వాహనాలకు మోక్షం వచ్చింది. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు వాటిని వేలం ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. 12 వాహనాలను ఈ నెల 8న వేలం వేయనున్నట్లు డీఆర్ఓ మలోల తెలిపారు. ఇందుకు సంబంధించి వేలం ప్రకటన శుక్రవారం విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవాళ్లు వేలంలో పాల్గొనాలని సూచించారు.

పాస్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

రాప్తాడు రూరల్: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 64వ సర్వసభ్య సమావేశం శుక్రవారం అనంతపురం మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి కర్ణాటక నుంచి సీనియర్ పాస్టర్ బిషప్ డాక్టర్ ఎం.ఫ్రాన్సిస్‌జాక్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనారోగ్యంగా బాధపడుతున్న పాస్టర్లకు, చర్చి నిర్మాణాలకు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బిందెల రాజు, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పి.మార్క్, కార్యదర్శి పాస్టర్ జీఆర్ ఆనంద్, జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి.మనష్షే, ట్రెజరర్ పాస్టర్ కె.జీవన్‌బాబు, ఈసీ సభ్యులు పాస్టర్ జహంగీర్ జాషువా, పాస్టర్ విజయసింహా, పాస్టర్ చార్లెస్ నాయక్, పాస్టర్ లాబాను సుధాకర్ పాల్గొన్నారు.

బౌద్ధధర్మాచరణే అశోక విజయ దశమి

అనంతపురం కల్చరల్: మానవ చరిత్రలోనే ఘోరమైన కళింగ యుద్ధం తర్వాత సామ్రాట్ అశోకుడు హింసను త్యజించి బౌద్ధ ధర్మ సూత్రాలను స్వీకరించారని.. అదే అశోక విజయ దశమిగా స్థిరపడిందని వక్తలు పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డులోని బుద్ధ విహార్‌పార్కు ఆవరణలోని బుద్ధ విగ్రహం వద్ద అశోక విజయదశమి వేడుకలను బౌద్ధ అనుయాయులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో రవీంద్ర, రాజగోపాల్, శివానందం, ఆనందరాజు, సుబ్బన్న, నరసింహమూర్తి తదితరులతో పాటు బుద్ధవిహార్ ఫే బ్యాక్ కమిటీ సభ్యులు హరిప్రసాద్, రాంబాబు, నారాయణస్వామి, రాజారమేష్, శ్రీధర్, కుమార్‌రాజ పాల్గొన్నారు.